ప్రజాశక్తి
మంగళవారం 8 అక్టోబర్ 2024
5
శ్రీ సత్యసాయి

ఈ సృష్టిలో ఎంతో విలువైనది, అపురూపమైనది అమ్మ ప్రేమ. అమ్మ నీడన అడుగులేస్తూ సాగించే జీవన ప్రయాణం అందమైన జీవితాన్ని ఇస్తుంది. అలాంటి అమ్మను కష్టాలు వెంటాడాయి. ఆదుకుని అక్కున చేర్చుకునే వారు కన్పించకపోవడంతో ఆమె జీవితం చీకటిమయం అయ్యింది. కష్టాల సుడిగుండంలో ఉన్న తన జీవితాన్ని అర్ధాంతరంగా ముగించాలనే కఠిన నిర్ణయం తీసుకుంది. తాను మరణించినా తన కూతురు బతికుండాలన్న ఉద్దేశంతో చిన్నారిని ఇతరుల చేతుల్లో పెట్టి చావును వెతుక్కుంటూ వెళ్లింది. చావాలని ఎంత ప్రయత్నించినా తన కూతురు పదేపదే గుర్తుకు రావడంతో కన్నప్రేమను వదిలుండలేక తిరిగి వెనక్కు వచ్చేసింది. తన కూతురిని తనకు ఇవ్వాలంటూ పోలీసుల ఎదుట వాపోయింది. కదిరి ఆర్టీసీ బస్టాండులో ఆదివారం నాడు ఓ చిన్నారని వదిలేసి వెళ్లిన ఘటన తల్లి వెనక్కు రావడంతో సుఖాంతం అయ్యింది. ఈ ఘటనకు సంబంధించి కదిరి సిఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...

బెడిసి కొట్టిన బాలయ్య వ్యూహం

హిందూపురంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యూహం బెడిసి కొట్టింది. మున్సిపల్ ఛైర్మన్ గిరిని సొంతం చేసుకోవాలనే వారి ఎత్తుగడలు ఫలించలేదు. అధికారంలో ఉండి ఛైర్మన్ స్థానానికి ఎన్నిక నిర్వహించడంలో చూపిన జాప్యం ప్రత్యర్థి పార్టీకి కలిసొచ్చింది. వైసిపిని వీడి టిడిపిలో చేరిన నలుగురు కౌన్సిలర్లు మళ్లీ సొంతగూటికి చేరుకోవడంతో ఛైర్మన్ గిరి వైసిపి ఖాతాలోకే వెళ్లనుంది.

- ◆ సొంత గూటికి చేరిన నలుగురు వైసిపి కౌన్సిలర్లు
- ◆ ఆ పార్టీదే మున్సిపల్ ఛైర్మన్ గిరి
- ◆ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా 3వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి..?

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంపై టిడిపి జెండాను ఎగర వేయాలని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, తన వ్యక్తిగత కార్యదర్శులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యూహాలు రచించారు. ఇందులో భాగంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు 9 మంది కౌన్సిలర్లను ఆగష్టు 15న ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో టిడిపిలోకి చేర్చుకున్నారు. అప్పటికే టిడిపికి సొంతంగా 6 మంది కౌన్సిలర్లతో పాటు బిజెపి, ఎంఐఎంకు చెందిన ఇద్దరి మద్దతు ఉంది. వీరితో పాటు వైసిపికి చెందిన 10 మంది కౌన్సిలర్లు, స్వతంత్రంగా గెలిచిన కౌన్సిలర్‌తో కలిపి 19 మందికి బలం పెరిగింది. కౌన్సిలర్లు కాకుండా ఎంపీ, ఎమ్మెల్యేల ఓట్లతో కలుపుకుంటే టిడిపికి 21 మందితో ఛైర్మన్ గిరి సొంతం చేసుకునేందుకు సంపూర్ణ మెజార్టీ లభించింది. సంఖ్యాపరంగా టిడిపికి బలం ఉండడంతో హిందూపురం ఛైర్మన్ గిరి టిడిపి ఖాతాలోకి వస్తోందని అందరూ ఊహించారు. అయితే ఎవరూ ఊహించని విధంగా టిడిపిలోకి చేరిన నలుగురు కౌన్సిలర్లు సోమవారం మళ్లీ సొంతగూటికి చేరారు. వైసిపి నాయకుడు వేణురెడ్డి సమక్షంలో వైసిపి కండువాలు కప్పుకున్నారు. నలుగురు వెనక్కు వెళ్లిపోవడంతో టిడిపికి బలం తగ్గింది.

రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రాగానే స్థానిక సంస్థల నుంచి పోటీ చేసి గెలుపొందిన వైసిపి ప్రజాప్రతినిధులు పార్టీ ఫిరాయించారు. చిలమత్తూరు మండలంలో వైసిపి ఎంపిటిసిలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. హిందూపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు టిడిపిలోకి చేరారు. దీంతో పాటు ఆగస్టు 20వ తేదీన మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ఇంద్రజ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. దీనికి సభ్యులు అమోదం తెలిపారు. రాజీనామ పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ వెంటనే డిఎంఎకు పంపారు. ఎన్నికల సంఘం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికకు నోటిపికేషన్ ఇచ్చే లోపు టిడిపిలో చేరిన కౌన్సిలర్లు మల్లికార్జున, రహమత్‌బి, మణి, పరశురాంలు తిరిగి వైసిపిలోకి చేరారు. దీంతో వైసిపి బలం పుంజుకుంది.

వైసిపిలోకి చేరిన కౌన్సిలర్లతో వైసిపి నాయకుడు వేణురెడ్డి

హిందూపురం పురపాలక సంఘంలో 38 వార్డులు ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో 30 స్థానాల్లో వైసిపి విజయం సాధించింది. టిడిపి 6, బిజెపి-1, ఎంఐఎం-1 స్థానాల్లో విజయం సాధించింది. వైసిపి గెలిచిన 30 స్థానాల్లో ఎన్నికలకు ముందు 12, 27వ వార్డు వైసిపి కౌన్సిలర్లతో పాటు ఎంఐఎం కౌన్సిలర్ టిడిపిలో చేరారు. బిజెపి కౌన్సిలర్‌తో కలుపుకుంటే టిడిపి బలం 10కి పెరిగింది. ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో ఛైర్‌పర్సన్‌తో సహా 9మంది వైసిపి కౌన్సిలర్లు పార్టీలోకి చేరారు. దీంతో మొత్తం 20 మంది కౌన్సిలర్లు, ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లతో కలుపుకుని 22 మందితో సంపూర్ణ బలం టిడిపికి వచ్చింది. వీరితో పాటు మరో 14 మంది వైసిపి కౌన్సిలర్లు టిడివిలోకి చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆ సమయంలో వార్తలు బలంగా వినిపించాయి. ఇందులో నలుగురిని పార్టీలో చేర్చుకోవడానికి టిడిపి నాయకత్వం తిరస్కరించినట్లు సమాచారం. సంపూర్ణ మెజార్టీతో మరో వారంలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన 6వ వార్డు కౌన్సిలర్ రమేష్ కుమార్ మున్సిపల్ ఛైర్మన్‌గా ఎంపిక జరుగుతుందనే ప్రచారం జరుగుతున్న సమయంలో వైసిపి కౌన్సిలర్లు సొంత గూటికి చేరడం కొత్త ట్విస్ట్‌ను ఇచ్చినట్లు అయ్యింది.

మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా లక్ష్మి..?

హిందూపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా 3వ వార్డు వైసిపి కౌన్సిలర్ లక్ష్మిని ఎంపిక చేస్తున్నట్లు ఆ పార్టీ అధినాయకత్వం నుంచి సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటికే వైసిపిలో 18 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరితో పాటు పార్టీ వీడిన వారిలో నలుగురు మళ్లీ పార్టీలో చేరడంతో వైసిపి బలం 22కు చేరింది. ఇక టిడిపి గెలచిన 6 మందితో పాటు బిజెపి-1, ఎంఐఎం-1, స్వతంత్ర అభ్యర్థి-1 వైసిపి నుంచి చేరిన వారిలో మరో 7 మంది టిడిపిలో ఉన్నారు. మొత్తం కలిపితే టిడిపి బలం 16 మాత్రమే అవుతంది. వీరితో పాటు ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు కలుపుకున్నా 18 అవుతుంది. వైసిపికి 22 మంది మద్దతు ఉండడంతో ఆ పార్టీకే ఛైర్‌పర్సన్ పదవి దక్కనుంది. ఈ సమయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా లక్ష్మిని ఎంపిక చేయడానికి ఆ పార్టీ అధిష్టానం ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా వైసిపికి చెందిన 7 మంది కౌన్సిలర్లతో పాటు ఎంఐఎంకు చెందిన కౌన్సిలర్లు సైతం టిడిపిని వీడి వైసిపిలోకి చేరే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదే జరిగితే చివరికి టిడిపిలో 6 మందితో పాటు కూటమి తరఫున ఉన్న బిజెపి కౌన్సిలర్‌తో కలుపుకుని ఏడుగురు మాత్రమే మిగిలే అవకాశాలు ఉన్నాయి.

3వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి

కష్టాలను భరించలేక.. కన్నప్రేమను వదిలుండలేక..!

◆ ఆత్మహత్య కోసం వెళ్లి తిరిగొచ్చిన తల్లి

ప్రజాశక్తి-కదిరి టౌన్

అనంతపురం జిల్లా గుమ్మగట్ట మండలం గలగల గ్రామానికి చెందిన జ్యోతి అనే మహిళకు పెళ్లి అయ్యింది. ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. సాఫీగా సాగుతున్న ఈమె జీవనం భర్త మరణంతో కష్టాలమయం అయ్యింది. భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లలను అత్త మామలు చదివిస్తామని చెప్పారు. దీంతో ఆమె జీవనోపాధి నిమిత్తం బెంగుళూరుకు వలస వెళ్లింది. ఈ క్రమంలో కర్నాటక రాష్ట్రం దొడ్డబల్లాపూర్ జిల్లా బేతం గ్రామానికి చెందిన కుమార్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తాను అండగా ఉంటానని మహిళకు చెప్పడంతో ఆమె అతన్ని వివాహం చేసుకుంది. వీరిద్దరికి ఓ పాప పుట్టింది. ప్రస్తుతం వీరికి ఏడాది లోపు వయస్సున్న ఆడ బిడ్డ ఉంది. ఇటీవల భర్త నుంచి వేధింపులు అధికం కావడంతో జ్యోతి జీవితంపై విరక్తి చెందింది. రెండు రోజుల క్రితం తన కూతురిని తీసుకుని ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. ఎలాగోలా ఆదివారం మధ్యాహ్నం కదిరికి చేరుకున్న ఆమెకు అక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలో తెలియలేదు. ఇక తన కష్టాలకు చావే పరిష్కారం అని భావించి ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకుంది. తాను చనిపోయినా తన కూతురు బతికుండాలని భావించి ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ విద్యార్థినికి తన కూతుర్ని ఇచ్చి వెళ్లిపోయింది. మహిళ ఎంత సేపటికీ రాకపోవడంతో విద్యార్థిని ఆర్టీసీ అధికారుల సాయంతో చిన్నారిని పోలీసులకు అప్పజెప్పింది.

మహిళకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

కూతురిని వదిలి ఉండలేక..

ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లిన మహిళ కదిరి సమీపంలోని పలు ప్రాంతాలకు కాలినడకన వెళ్లింది. పదేపదే తన కూతురు గుర్తుకు రావడంతో ఆత్మహత్య చేసుకోలేకపోయింది. ఇదే సమయంలో ఈ మహిళను గుర్తించిన స్థానికులు ప్రశ్నించారు. ఆమె పరిస్థితి కొంత అనుమానంగా ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా అసలు విషయం వెల్లడించింది. వెంటనే పోలీసులు ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కాగా ప్రస్తుతం మహిళ కూతురు పుట్టపర్తిలోని శిశు విహార్‌లో ఉందని, బంధువుల సమక్షంలో బిడ్డను ఆమెకు అప్పగిస్తామని సిఐ నారాయణరెడ్డి తెలిపారు.

పెనుకొండలో 'అధికార' లిక్కర్‌వార్.!

- ◆ మంత్రి, ఎంపీ వర్గీయుల పోటాపోటీ
- ◆ ఎంపీ మద్దతుదారులను అడ్డగించిన మంత్రి అనుచరులు
- ◆ ముగ్గురు నేతల అనుచరులు పెద్ద ఎత్తున దరఖాస్తులు దాఖలు

బికె మద్దతుదారులను అడ్డుకుంటున్న సవితమ్మ మద్దతుదారులు

ప్రజాశక్తి-పెనుకొండ

మద్యం షాపుల టెండర్ల వ్యవహారం పెనుకొండ అధికార పార్టీలో కాక పుట్టిస్తోంది. ఏకంగా మంత్రి సవితమ్మ, ఎంపీ బికె.పార్థసారథి మద్దతుదారులు ఒకరినొకరు బహిరంగంగానే దూషించుకునే పరిస్థితులు వెలుగుచూస్తున్నాయి. మద్యం షాపుల టెండర్ పత్రాలు దాఖలు చేసేందుకు వెళ్లిన ఎంపీ బికె.పార్థసారథి మద్దతుదారులను మంత్రి సవితమ్మ అనుచరులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. పెనుకొండ నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన ముగ్గురు నేతల అనుచరులు పోటాపోటీగా టెండర్ల దాఖలు చేస్తున్నారు.

పెనుకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 13 మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. పెనుకొండ టౌన్ పరిధిలో 3, పెనుకొండ రూరల్ పరిధిలో గుట్టూరు 1, అమ్మవారుపల్లి 1, రొద్దం 1, సోమందేపల్లి 3, గోరంట్ల 4 షాపులకు టెండర్లు నమోదు జరుగుతోంది. ఈ నాలుగు మండలాల పరిధిలో మంత్రి సవిత వర్గానికి చెందిన కొందరు నాయకులు టెండర్ల వేసేందుకు గ్రూపులుగా ఏర్పడ్డారు. మరోవైపు ఇదే నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎంపీ బికె.పార్థసారథి మద్దతుదారులు సైతం టెండర్ల వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. సోమవారం నాడు పెనుకొండ ఎక్సైజ్ స్టేషన్‌లో టెండర్ల దాఖలు చేసేందుకు ఎంపీ మద్దతుదారులు వచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న మంత్రి సవిత అనుచరులు వారిని అడ్డుకున్నారు. టెండర్ల వేసేందుకు స్టేషన్‌లోకి వెళ్లరాదంటూ వాదనకు దిగారు. తాము టెండర్లు వేసి తీరుతామని బికె మద్దతుదారులు చెప్పడంతో అక్కడ పరిస్థితి కాస్త ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న సిఐ రాఘవన్ ఇరు వర్గాల వారికి నచ్చజెప్పి వారిని స్టేషన్ అవరణ నుంచి బయటకు పంపారు. ఈ నేపథ్యంలో సీనియర్ నాయకులు జివిపి.నాయుడు, రొద్దం సుబ్బరత్నమ్మ తదితరులు టెండర్ల వేసేందుకు అనుచరులను వెంటపెట్టుకుని వచ్చారు. స్టేషన్ గేటు వద్దే వారిని సవితమ్మ మద్దతుదారులు అడ్డగించి వాగ్వాదనకు దిగారు. అక్కడే ఉన్న కొందరు సీనియర్ నాయకులు జోక్యం చేసుకుని వారికి సర్దిచెప్పారు. అనంతరం నాయకులు అంతా ఓ నాయకుని ఇంట్లో సమావేశం అయ్యి టెండర్ల దాఖలపై మంతనాలు జరిపారు. మరో వైపు మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప మద్దతుదారులు సైతం గోరంట్ల మండలంలో మద్యం షాపులకు 20 టెండర్ల దాఖలు చేశారు. ఇలా పెనుకొండ నియోజకవర్గంలో ముగ్గురు నేతల మద్దతుదారులు షాపులను దక్కించుకునేందుకు పోటాపోటీగా టెండర్ల దాఖలు చేశారు. కాగా ఒకే పార్టీ నేతలు షాపులను దక్కించుకునేందుకు బహిరంగంగా ఇలా వాదులాడుకోవడం ఆ పార్టీలో తీవ్ర చర్చనీయాంశం అవుతోంది.

క్షేత్రస్థాయిలో పర్యటిస్తే సమస్యలు పరిష్కారం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి వినతినీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పరిష్కారం లభిస్తుందని, ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సూచించారు. సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో 171 అర్జీలను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డీఆర్డీఏ పీడీ నరసయ్యతో కలిసి స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, జిల్లాలో దృష్టి సారించాల్సిన అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు వారానికి ఒకరోజు శుక్రవారం హాస్టళ్లు, రైతు సేవా కేంద్రాలు, ప్రభుత్వాసుపత్రులు తనిఖీలు చేయాలన్నారు. అక్కడ సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కింద స్థాయి సిబ్బందితో సమన్వయంతో పనిచేసుకుని శాఖలోని ప్రతి అంశంపై అవగాహనతో ముందుకు సాగాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి సకాలంలో కౌంటర్ ఫైల్స్, అపిల్ దాఖలు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు వీలైనన్ని ఎక్కువ పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

పకడ్బందీగా ఉచిత ఇసుక విధానం

జిల్లాలో పకడ్బందీగా ఉచిత ఇసుక విధానం అమలు చేయనున్నట్లు కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కానరెన్స్ హాల్‌లో ఉచిత ఇసుక విధానం అమలుపై ఎస్పీ వి.రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 15వ తేదీ తర్వాత జిల్లాలో ఉన్న ఇసుక రీచ్‌లు మాన్యువల్ ఆపరేషన్‌లో ఉంటాయన్నారు. జిల్లాకు సంబంధించి సిసి రేవు, పిసి రేవులలో ఇసుక అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇసుక ధర ఉచితం కాగా నిర్వహణ ఖర్చుల కింద ఒక టన్నుకు రూ.399 డబ్బులను ఆన్‌లైన్‌లో చెల్లించి ఇసుకను పొందవచ్చునని తెలియజేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వ, బ్లాక్ మార్కెటింగ్‌పై రోజువారీగా కేసులు రిజిస్టర్ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనింగ్ శాఖ అధికారి షేక్ అమీర్ బాషా, ధర్మవరం ఆర్డీవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిర్యాలీ చేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

పాలస్తీనాపై యుద్ధం ఆపాలని శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ఇజ్రాయిల్ దేశంలో యుద్ధం ఆపాలని కోరుతూ సోమవారం సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న ఆధ్వర్యంలో పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నుంచి జాతీయ రహదారిపై ఉన్న నాలుగు కూడళ్ల సర్కిల్ వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహులు మాట్లాడుతూ ప్రతీకార దాడి పేరుతో ఇజ్రాయిల్‌లో విచక్షణా రహితంగా పాల్పడుతున్న దాడులు, ఘర్షణలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. ఈ నెల 7వ తేదీ పాలస్తీనాలో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో సుమారు 42 వేల మందికి పైగా పాలస్తీనా ప్రజలు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల్లో మహిళలు, చిన్నారులతో పాటు ఎక్కువ మంది సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఉన్నారన్నారు. వాస్తవానికి మృతుల సంఖ్య 85 వేలకు పైగానే ఉంటుందని వారి అంచనా అన్నారు. ఇకనైనా కాల్పుల విరమణ కోసం, మృతుల ఆత్మకు శాంతి కలగాలని శాంతి ర్యాలీ నిర్వహించామన్నారు. ర్యాలీకి ఆవాజ్ కమిటీ కార్యదర్శి బాబ్జాన్, సిఐటియు మండల కార్యదర్శి వెంకటేష్, పోతలయ్య, బాబాఫక్రుద్దీన్, నౌషాద్, చికెన్ రఫీ, రహీం, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిషార్ మద్దతు పలికారు.

యానిమేటర్‌పై అక్రమ కేసును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

యానిమేటర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డ్వాక్రా సంఘాల మహిళలతో కలిసి కలెక్టరేట్ ముందు గంట పాటు బైఠాయించారు. తక్షణమే ఎపిఎం, సీసీలపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ కదిరి మండలంలోని ముత్యాల చెరువు గ్రామంలో శ్రీఆంజనేయ గ్రామైక్య మహిళా సంఘాలకు లింగాల సుబ్బారెడ్డి యానిమేటర్‌గా పని చేస్తున్నారన్నారు. ఇతడు వచ్చిన తర్వాతే ఈ సంఘం లాభాల్లో నడుస్తున్నందన్నారు. అయితే ఎపిఎం శారద, సీసీ నరసింహులు సుబ్బారెడ్డిని నిబంధనలకు విరుద్ధంగా తొలగించి వారికి అనుకూల మైన బండి నిర్మలను నియమించారని మండిపడ్డారు. ఎపిఎం, సీసీ కుట్రలను డ్వాక్రా మహిళలు సైతం తిరస్కరించారన్నారు. దీంతో యానిమేటర్ సుబ్బారెడ్డితో పాటు మహిళా సంఘాలపై వారు అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఎపిఎం, సీసీపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని యానిమేటర్, మహిళా సంఘాల లీడర్లపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిచో పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ టిఎస్.చేతన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యానిమేటర్ సుబ్బారెడ్డి, మహిళా సంఘాల లీడర్లు, 200 మందికిపైగా సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముందు బైఠాయించిన సిఐటియు నాయకులు, మహిళా సంఘాల సభ్యులు

పింఛన్ల తొలగింపు దారుణం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేష్

పుట్టపర్తి క్రైమ్ : ప్రభుత్వం వృద్ధులు, వికలాంగుల పింఛన్లు తొలగించడం దారుణమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేష్ తెలిపారు. పింఛన్ల తొలగింపుపై సిఐటియు ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ కనగానపల్లి మండలంలోని వేపకుంట గ్రామంలో రాజకీయ వర్గ విభేదాలతో ఒకే గ్రామంలో ఏకంగా 62 మంది వృద్ధులు, వికలాంగుల పింఛన్లు తొలగించారన్నారు. రాజకీయ కక్షలో భాగంగా పింఛన్లు తొలగిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించి అర్హులకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని, లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ టిఎస్.చేతన్‌కు వినతి పత్రం సమర్పించారు.

రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని గద్దలబండతండా నుంచి కందుకూరు క్రాస్ వరకూ మంజూరైన బిటి రోడ్డు పనులను సోమవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రోడ్డు పనులకు శ్రీకారం చుట్టామన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండూ సమానంగా ఉండేలా పరిపాలన సాగిస్తోందన్నారు. సూపర్ సిక్స్‌తో పాటు హామీలన్నీ దశల వారీగా అమలు చేయడానికి సిఎం చంద్రబాబు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ నాయుడు, గేమేనాయక్‌తండా సర్పంచి కాంతమ్మ, మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, కావడి ప్రవీణ్ కుమార్, నాగేంద్రప్రసాద్, రాజారెడ్డి, సోంపాల్యం నాగభూషణ, రమణయ్య, ఉత్తన్ననాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

మండలంలోని శింగిరివాండ్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త నాగరాజు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట ఆ గ్రామం వెళ్లి నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించాలి : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

'ప్రజాసమస్యల పరిష్కారవేదిక'లో అందిన ఫిర్యాదులకు వెంటనే పరిష్కారం చూపాలని బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని భువన విజయం సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించగా పెనుకొండ నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మంత్రి అర్జీలు స్వీకరించారు. ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇందులో కుటుంబ కలహాలు, భూ, ఆస్తి వివాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు సమర్పించారు. వైసిపి హయాంలో తమ భూములను వైసిపి నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించారని పలువురు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పింఛను పొందేందుకు అర్హత ఉన్నా ఇవ్వడంలేదని కొందరు, గతంలో వస్తున్నా ఇప్పుడు ఆపేశారని మరికొందరు వాపోయారు. రేషన్ కార్డుల విషయంలోనూ ఫిర్యాదులు వచ్చాయి. ఆయా సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో 410 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, తహశీల్దార్ శ్రీధర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీలు బాగుచేయండి : సిపిఎం

పెనుకొండ టౌన్ : పట్టణంలో అధ్వానంగా మారిన రోడ్లు, డ్రెయినేజీల మరమ్మతులు చేపట్టాలని సిపిఎం నాయకులు హరి, బాబావలి ఆధ్వర్యంలో మంత్రి సవితకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, తిప్పన్న, తదితరులు పాల్గొన్నారు. పెనుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ సెంటర్ల మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో మంత్రి సవితకు వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన మంత్రి సిడిపిఒ శాంతలక్ష్మిని పిలిపించి శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ సెంటర్లను ఇతర అద్దె భవనాల్లోకి మార్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, నాయకులు రాజు రావు, తిప్పన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, మహేష్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బావమ్మ, సెక్టార్ లీడర్లు పద్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సవితకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు హరి, తదితరులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

పెనుకొండ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి సవిత వైద్యులకు సూచించారు. పట్టణంలోని ఆర్అండ్బి అతిథి గృహంలో సోమవారం నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ వైద్యులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, రోగులకు ప్రయివేట్ ఆసుపత్రులకు దీటుగా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఇళ్ల స్థలాల కోసం వ్యకాసం ధర్నా

ప్రజాశక్తి-గోరంట్ల

మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఇల్లు లేని పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత అధ్యక్షతన స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ గోరంట్లతో పాటు మండలంలోని మందలపల్లి, బూచేపల్లి, గంగంపల్లి, తండా, బూదిలి, తదితర గ్రామాల్లో ఇల్లు లేని పేదలు సుమారు 300 మంది 6 నెలల క్రితం ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వాటిని పరిశీలించి వెంటనే న్యాయం చేయాలని కోరారు. అలాగే గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్లో పేదలకు కాకుండా నాయకులు వారి బంధువు లకు ధారాదత్తం చేశారని మండిపడ్డారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నర్సింపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వని పక్షంలో భవిష్యత్తులో పేదలను సమీకరించి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ మారుతికి వినతి పత్రం ఇచ్చారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఈ నెల చివరికి విచారణ పూర్తి చేసి చట్టబద్ధంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, మండల కో కన్వీనర్ రామాంజనేయులు, ఇళ్ల స్థలాల దరఖాస్తుదారులు గీతమ్మ, నందిని, రేఖ, కైరున్బీ, హుస్సేన్బీ, మంజుల, శంకరమ్మ, రూపవతి, సాలమ్మ పాల్గొన్నారు.

తహశీల్దార్ మారుతికి వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ధర్మవరం కమిషనర్గా ప్రమోద్కుమార్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



ధర్మవరం మున్సిపల్ కమిషనర్గా సోమవారం ప్రమోద్కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మల్లికార్జున బదిలీపై ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి వెళ్లారు. జమ్మలమడుగు ప్రాజెక్ట్ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తున్న ప్రమోద్కుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే కర్తవ్యం అన్నారు. కమిషనర్కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కదిరి ఎక్సైజ్ సిఐగా వీరారెడ్డి

కదిరి టౌన్ : కదిరి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐగా వీరారెడ్డి పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ కదిరి ఎక్సైజ్ పరిధిలో 12 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకూ 31 దరఖాస్తులు వచ్చాయన్నారు.

నల్లచెరువు ఎంపిడిఓగా రఘునాథ్గుప్తా

నల్లచెరువు : మండల నూతన ఎంపిడిఓగా సోమవారం రఘునాథ గుప్తా బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా వ్యవహరించి అర్హులకు న్యాయం చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం నుంచి ప్రజలకు రావాల్సిన ఫలాలను సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఓబుళదేవరచెరువు : నూతన ఎంపిడిఓ విల్సన్ను టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుల్రెడ్డి, మండల కార్యదర్శి జయచంద్ర, మండోజి ఆరిఫ్ఖాన్, షాను, వెంకటేష్, బోయపల్లి శివారెడ్డి, శ్రీనివాసులు, చాంద్బాషా, షబ్బీర్, రామానాయుడు, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి ఈవోఆర్డీగా లక్ష్మీ నరసమ్మ

సోమందేపల్లి : స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో నూతన ఈవోఆర్డీగా ఎం.లక్ష్మీనరసమ్మ బాధ్యతలు చేపట్టారు. కూడేరు మండలంలో పనిచేస్తున్న ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మండలంలోని పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిచేందుకు బాధ్యతగా పని చేస్తానన్నారు. నూతన ఈవోఆర్డికి పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రామాంజనేయులు, కృష్ణప్రసాద్, సావిత్రి, శైలజ, సాయి, సోమశేఖర్, అరుణ, రమేష్, శారద, శాంతి, గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు ఈవోఆర్డీగా నటరాజు

కొత్తచెరువు : మండల నూతన ఈవోఆర్డీగా స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో నటరాజు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవోఆర్డీ బదిలీపై వెళ్లడంతో హిందూపురం రూరల్లో పని చేస్తున్న నటరాజు ఇక్కడికి వచ్చారు. నూతన ఈవోఆర్డీ మాట్లాడుతూ మండలంలోని పంచాయతీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

నల్లమాడ ఎపిఎంగా గోపాల్

నల్లమాడ: మండలం నూతన ఎపిఎంగా గోపాల్ బాధ్యతలు స్వీకరిం చారు. ఆయన మాట్లాడుతూ అమడగూరు మండలంలో ఎపిఎంగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చానన్నారు. గ్రామ సంఘాలు, యానిమేటర్లకు అందు బాటులో ఉండి వారి సమస్యలు తెలుసుకొని ప్రతి సంఘానికి న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. ఆయనకు సీసీలు, యానిమేటర్లు శుభాకాంక్షలు తెలిపారు.

నల్లచెరువు ఎపిఎంగా జయరమణప్ప

నల్లచెరువు : శ్రీఆంజనేయస్వామి మండల సమైక్య ఎపిఎంగా జె.రమణప్ప బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రవీంద్ర బదిలీపై ఓడిసికి వెళ్లారు. నూతన ఎపిఎం మాట్లాడుతూ నిజమైన అర్హులకు న్యాయం చేస్తానన్నారు. నిరుపేదలను గుర్తించి వారికి ప్రభుత్వ పరంగా రావాల్సిన ఫలాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సమైక్య సభ్యురాలు పాల్గొన్నారు.

ఘనంగా రైతు క్షేత్ర దినోత్సవం

లేపాక్షి : మండలంలోని సిరివరం గ్రామంలో సోమవారం కేంద్ర పట్టుమండలి అనంతపురం ఆధ్వర్యంలో రైతు క్షేత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సెరికల్చర్ జాయింట్ డైరెక్టర్ శ్రీనాథ్ మల్బరీ సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మల్బరీ సాగుపై రైతులకు పలు సూచనలు, సలహాలు, రాయితీలపైప అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైంటిస్ట్ ఇబ్రహీంబాషా, సెరికల్చర్ సహాయ సంచాలకులు సురేష్కుమార్, ఇన్స్పెక్టర్ చంద్రమోహన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కమతం కాటమయ్య మండల అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ స్వర్ణలత, నరసింహనాయుడులను కలిసి పలు సమస్యలను వివరించారు. చాలా గ్రామాల్లో శ్మశానవాటికకు స్థలాలు లేవన్నారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయించి, వారికి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు రామకృష్ణ, సత్యప్ప, రామదాసు, జయమ్మ, పెద్దన్న, హమాలీ యూనియన్ నాయకులు మాతంగి వెంకటేష్, మారెక్క, పుల్లన్న, వెంకటప్ప, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఎంపీడీవోకు వినతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని దర్శినమల బిసి కాలనీలో త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కాలనీవాసులు ఎంపిడిఓ సాయి మనోహర్కు వినతిపత్రంతం సమర్పించారు. వారు దర్శినమల గ్రామంలో అన్ని వీధులకు నీటి సరఫరా ఉన్నా ఒక్క బిసి కాలనీకి మాత్రం చాలా రోజుల నుంచి నీటి సరఫరా బంద్ అయిందన్నారు. దీంతో చాలా దూరం నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీకి వెంటనే పైపులైన్ వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎంపిడివో వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు సూర్యనారాయణ, ధనుంజయ, నారాయణ, హరి, నాగరాజు, నారాయణస్వామి, రామాంజి, మారుతి, చెన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు, ఈకేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఖరీఫ్ సీజన్లో పంటలు సాగు చేసిన రైతులందరూ ఈ పంట నమోదు, ఈకేవైసీ చేయించు కోవాలని తహశీల్దార్ స్వర్ణలత సూచించారు. ఆమె సోమవారం ఏవో ఓబిరెడ్డితో కలిసి మండలంలోని బత్తలపల్లి, మాల్యవంతం రెవెన్యూ గ్రామాల్లో పర్యటించి 2024 ఖరీఫ్ సీజన్కు సంబంధించిన ఈ పంట నమోదు చేసిన పొలాలను పరిశీలించారు. ఈ పంట నమోదైన ప్రతి రైతు వ్యవసాయ శాఖ అధికారులను కలిసి తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వం నుంచి పరిహారం, తదితర ఉపయోగాలు ఉంటాయన్నారు. వారి వెంట ఎఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, ఎఇఓ ఉపేందర్రెడ్డి, విఎఎలు హరిప్రియ, లావణ్యలత ఉన్నారు.

బాధిత రైతుకు పరామర్శ

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని తంబాపురం గ్రామంలో రైతు రమణారెడ్డి రెండెకరాల పొలంలో రెండేళ్ల క్రితం నాటిన 53 చీనీ చెట్లను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. ఈ విషయం తెలియడంతో మంత్రి సత్యకుమార్ కార్యాలయ ఇన్ఛార్జి హరీష్, సిబ్బంది, బిజెపి నాయకులు సోమవారం ఆ గ్రామం వెళ్లి బాధిత రైతు రమణారెడ్డిని పరామర్శించారు. అలాగే పొలానికి వెళ్లి నరికివేసిన చీనీచెట్లను పరిశీలించారు. ఇలాంటి సంఘటనలకు పాల్పడి రైతులను దెబ్బతీయడం సరైంది కాదని, ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆకులేటి వీరనారప్ప, రవి, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-అమడగూరు

మండలంలోని తుమ్మలకొండపై వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో చోరీకి పాల్పడిని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 2 పంచలోహ విగ్రహాలు, వెండి గొడుగు, వెండి ముఖ కవచం స్వాధీనం చేసుకు న్నట్లు ఎస్ఐ ఎ.వెంకటనారాయణ తెలిపారు. వివరాలు.. ఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుల్ పి.సూర్యనారాయణ, కానిస్టేబుళ్లు ఎ.విజయ భాస్కర్ సోమ వారం మండలంలోని వెంకటనారాయణపల్లి క్రాస్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆలయంలో చోరీకి పాల్పడిన నగిరిగిరి గంగరాజు, చెడిపోతుల నాగరాజులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి విగ్రహాలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకొని రిమాండ్ నిమిత్తం కదిరి కోర్టుకు పంపినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కన్ను కోల్పోయిన వ్యక్తి

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని గౌరాజుపల్లి గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని బూచెర్ల గ్రామానికి చెందిన చంద్రమౌళి కన్ను కోల్పోయాడు. చంద్రమౌళి స్థానిక ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రి పరిధిలోని బూచెర్ల క్లస్టర్లో గోపాలమిత్రగా పనిచేస్తున్నాడు. అతడు ఉదయం ద్విచక్ర వాహనంపై వస్తూ గౌరాజుపల్లి ఎస్సీ కాలనీ వద్ద మలుపులో ఎదురుగా వస్తున్న ఎద్దుల బండిని ఢీకొనడంతో కుడి కన్ను పూర్తిగా దెబ్బతింది. అతడిని గ్రామస్తులు 108 సహకారంతో పెనుకొండ ఆసుపత్రికి, అక్కడి నుంచి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కన్ను పూర్తిగా దెబ్బ తినడంతో తిరుపతికి రిఫర్ చేసినట్లు బంధువులు తెలిపారు.

మద్యం షాపులకు 219 దరఖాస్తులు

ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద నాయక్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద నాయక్ తెలిపారు. పట్టణంలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం ఆయన ఎఈఎస్ నరసింహులుతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 87 షాపులకు ఇప్పటి వరకూ 219 దరఖాస్తులు దాఖలు అయ్యాయన్నారు. 9వ తేదీ వరకూ గడువు ఉందన్నారు. కొందరు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల పేరు చెబుతూ అసత్య ప్రచారానికి పాల్పడుతున్నారని, అపోహలకు తావు లేకుండా ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో ఎక్కడి నుంచైనా, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నుంచి కానీ లేక ఆన్లైన్ ద్వారా కానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు

హిందూపురం : మద్యం దుకాణం కోసం ఒక అభ్యర్థి ఒక షాపు కోసం ఎన్ని దరఖాస్తులైనా చేసుకోచ్చని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య, సిఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. పట్టణంలో వారు మాట్లాడుతూ దరఖాస్తుదారులు రాష్ట్ర పరిధిలోనే కాకుండా కర్నాటక, తెలంగాణ, తమిళనాడు, ఒడిస్సా, తదితర రాష్ట్రాల్లో షెడ్యూల్ బ్యాంకుల నుంచి డీడీలు అందజేయవచ్చు అన్నారు. దరఖాస్తులు సమర్పించుకోవడానికి, లక్కీ డ్రాలో పాల్గొనేందుకు దరఖాస్తుదారుడు తన ప్రతినిధిగా మరో వ్యక్తిని నియమించ్చుకోవచ్చు అన్నారు.

లాటరీ విధానంపై కలెక్టర్ స్పష్టత ఇవ్వాలి

నూతన మద్యం పాలసీలో భాగంగా ఈ నెల 11వ తేదీ లాటరీ తీసే విధానంపై పలు అనుమానాలు ఉన్నాయని, దీనిపై జిల్లా కలెక్టర్ స్పష్టత ఇవ్వాలని మడకశిర నియోజకవర్గ దళిత నాయకులు బిహెచ్.రాయుడు, గుడిబండ మాజీ ఎంపిపి ఎల్కె.నరసింహులు డిమాండ్ చేశారు. వారు పట్టణంలోని ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొందరు అధికార పార్టీ నాయకులు షాపులు తమకే సొంతం అనేలా వ్యవహరిస్తున్నారని, కావున దీనిపై పారదర్శకత కోసం జిల్లా కలెక్టర్ స్పష్టత ఇవ్వాలన్నారు. సమావేశంలో దళిత నాయకులు శేఖర్, బైలప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారి గోవింద నాయక్

ధర్మవరం రూరల్ : నియోజకవర్గం వ్యాప్తంగా 20 మద్యం దుకాణాలు కేటాయించారని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ చంద్రమణి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్లో ఆమె మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలో-10, రూరల్-2, బత్తలపల్లి-3, తాడిమర్రి-1, ముదిగుబ్బ-4 షాపులకు కేటాయించారన్నారు. సమావేశంలో ఎస్ఐలు నాగరాజు, చాంద్బాషా పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 3 మండలాలకు 5 మద్యం షాపులు కేటాయించినట్లు సికె పల్లి ఎక్సైజ్ సిఐ ఫరూక్ ఇజం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికె పల్లి మండలానికి 2, కనగానపల్లి-2, రామగిరి మండలానికి 1 చొప్పున కేటాయించారు.

డీఎస్పీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎస్పీ రత్న

బదిలీ డీఎస్పీకి ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి డీఎస్పీగా పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ఆవుల శ్రీనివాసరావుకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ వి.రత్న మాట్లాడుతూ శ్రీనివాసరావు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ, పుట్టపర్తి ఇన్ఛార్జి డీఎస్పీగాగా సమర్థవంతంగా పని చేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకొచ్చారన్నారు. భవిష్యత్తు లో కూడా బాగా పనిచేసి అందరి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్పీ డీఎస్పీని శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, ఎస్బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐ వలి, ఎస్బి ఎస్ఐ ప్రదీప్కుమార్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోను కలిసిన కూటమి నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండల నూతన ఎంపిడివో సాయి మనోహర్ని సోమవారం రూరల్ మండలంలోని మల్లకాల్వ కూటమి నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, స్వీట్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిడివో మాట్లాడుతూ మండల ప్రజలు, రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. మండలంలో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, తదితర విషయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్రెడ్డి, జనార్దన్రెడ్డి, సి.రామ్మోహన్రెడ్డి, నారాయణరెడ్డి, ఓబుళనాయనపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

పుట్టపర్తి రూరల్ : అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్న వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అటవీ శాఖ బుక్కపట్నం రేంజ్ సెక్షన్ ఆఫీసర్ చంద్రనాయక్ తెలిపారు. మండలంలోని జగరాజుపల్లి విజ్ఞాన్ నర్సింగ్ కళాశాలలో సోమవారం బుక్కపట్నం అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో వన్యప్రాణి సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అటవీ శాఖ అధికారి వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వన్యప్రాణాలు గ్రామాల్లోకి వస్తే రక్షించే అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సులో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు గంగాద్రి, చిన్నప్పయ్య, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల ధర్నా

మడకశిర రూరల్ : కమీషన్ తగ్గించడంపై సోమవారం పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం ముందు ఎల్ఐసి ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ వైకుంఠంకు వినతిపత్రం సమర్పిం చారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్ల్ యూని యన్ అధ్యక్షులు దేవరాలప్ప, నాగేంద్రప్ప, శ్రీనివాస రావు, శంకరగల్లు లక్ష్మీనరసప్ప, నాగేష్, గుడ్డంపల్లి హనుమంతరావు, తదితర ఏజెంట్లు పాల్గొన్నారు.

తహశీల్దార్ వైద్యానికి ఆర్థిక సాయం

పరిగి : 2017-18లో మండల తహశీల్దార్గా పని చేసిన భరత్కుమార్ ప్రాణాంతక వ్యాధితో బెంగళూరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ తహశీల్దార్లతో పాటు రెవెన్యూ యంత్రాంగ స్పందించి విరాళాలు సేకరిస్తున్నారు. ప్రస్తుత తహశీల్దార్ హసీనా సుల్తానాకు దివ్య ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పరిగి వేణుగోపాలరావు ట్రస్ట్ ద్వారా రూ. 25వేల చెక్కును అందజేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన మండల తెలుగు యువత నాయకులు చిన్నానాయుడు సోమవారం చెర్లోపల్లి గ్రామంలో చౌడేశ్వరీమాత ఆలయ నిర్మాణానికి రూ. 20 వేలు విరాళం అందజేశారు.

వరద బాధితులకు ఆర్థికసాయం

నల్లమాడ : విజయవాడ వరద బాధితుల కోసం నల్లమాడ సర్పంచి రమావత్ భారతి చాంప్లా నాయక్ సోమవారం పంచాయతీ జనరల్ ఫండ్ ద్వారా సిఎం సహాయనిధికి రూ. 20 వేలను పంపించారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి రఘునాథరెడ్డి సూచనల మేరకు పంపినట్లు ఆమె తెలిపారు.

దళితుల భూమి కబ్జాపై ఫిర్యాదు

ప్రజాశక్తి-బత్తలపల్లి

దళితుల భూములను దౌర్జన్యంగా ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బాధితులతో కలిసి తహశీల్దార్ స్వర్ణలత, ఎస్ఐ శ్రీనివాసులుకు వినతి పత్రాలు అందజేశారు. హరి విలేకరులతో మాట్లాడుతూ దంపెట్ల పొలం సర్వే నెంబర్ 288-2ఎలో 3.09 ఎకరాల భూమి మాల గంగప్పకు చెందిందన్నారు. ఆ భూమికి సంబంధించి టిడిపికి చెందిన పురుషోత్తంనాయుడు తన భార్య అశ్వర్థమ్మ పేరుపై బోగస్ డి పట్టా, నకిలీ పాసు పుస్తకాలు సృష్టించి ఆన్లైన్లో ఎక్కించారన్నారు. అశ్వర్థమ్మవి నకిలీ పత్రాలు అని తహశీల్దార్ ధ్రువీకరించినా ఆమె పేరును ఆన్లైన్లో తొలగించకపోవడం అన్యా యం అన్నారు. పురుషోత్తం నాయుడు బాధిత దళితులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపో యారు. శ్మశానవాటికను సైతం కబ్జా చేశారన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షులు కె.ఓబులేసు, శ్రీనివాసులు, నాయకులు రమేష్, నారాయణస్వామి, రామక్రిష్ణ, చౌడప్ప, హరి, గంగాధర్, శ్రీరాములు, ఆదినారాయణ పాల్గొన్నారు

ఎస్ఐ శ్రీనివాసులుకు వినతి ఇస్తున్న దళిత నాయకులు

మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ తల్లి మృతికి నివాళి

ప్రజాశక్తి-బత్తలపల్లి

ధర్మవరం మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, వైసిపి సీనియర్ నాయకులు గొల్లపల్లి రామకృష్ణారెడ్డి తల్లి గొల్లపల్లి లింగమ్మ(95) అంత్యక్రియలను సోమవారం మండలంలోని నల్లబోయనపల్లి గ్రామంలో నిర్వహించారు. ఆమె ఆదివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే పలువురు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి నివాళులర్పించారు. ఆమె కుమారులు రామకృష్ణా రెడ్డి, నరసింహారెడ్డి, వేణుగోపాల్రెడ్డి, వాసుదేవరెడ్డి, కుమార్తె హేమలత సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. నాయకులు బక్కచెర్ల నలపరెడ్డి, రేగాటిపల్లి గంగిరెడ్డి, వైస్ ఎంపిపి గజ్జెల వెంగళరెడ్డి, వీరారెడ్డి, సుబ్బారెడ్డి, మాలగుండ్ల మల్లికార్జున, గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్లు మాదిరెడ్డి జయరామిరెడ్డి, సీవీ నారాయణరెడ్డి, కోటి సురేష్, బగ్గిరి బయపరెడ్డి, చల్లా శ్రీరాములు, సర్పంచులు సానే జయచంద్రారెడ్డి, చల్లా కరుణాకర్నాయుడు, కంచనగారి రాజశేఖర్రెడ్డి, వెంగురెడ్డి, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, ఈడిగ కాకప్ప, సానే సూర్యనారాయణరెడ్డి. కప్పల నారాయణస్వామి, బాయిరెడ్డి, యోగారెడ్డి, ఓబిరెడ్డి, నరసింహారెడ్డి, చల్లా క్రిష్ణ, హనుమంతరెడ్డి, వెంకటరెడ్డి, గుమ్మడి అనంతరెడ్డి, బోయపాటి సూరి, బండి వీరనారప్ప, పెద్దప్ప తదితరులు లింగమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

లింగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్స్కు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్లోని సభ్యులకు న్యాయం చేయాలని సభ్యులు కోరారు. స్థానిక పుట్టపర్తి రోడ్డులోని దేవి నర్సింగ్ హోం ఎదురుగా ఉన్న ప్లంబర్స్, ఎలక్ట్రిషియన్స్ ప్లాట్స్ వివాదంపై సోమవారం కళాజ్యోతి సర్కిల్లోని ప్రెస్క్లబ్లో అసోసియేషన్ సభ్యులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ధర్మవరం ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్లో 107 మంది సభ్యులు ఉన్నారన్నారు. అయితే వైస్ ప్రెసిడెంట్ సురేంద్ర, రాజు అసోసియేషన్ను అడ్డు పెట్టుకొని అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని మండిప డ్డారు. ప్రభుత్వం గతంలో ఈ అసోసి యేషన్కి 650 సర్వే నెంబర్లో రెండెకరాలు కేటియించిందన్నారు. ఇందులో అక్రమ లే అవుట్లు వేసి బినామీ పేర్లతో ఒక్కో ప్లాటు రూ. 5 నుంచి రూ. 10 లక్షలకు అమ్ముకున్నారని ఆరోపించారు. వారి అక్రమాలకు అడ్డుకట్ట వేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టి.శ్రీరాములు, ఎం.దాదాపీర్, ఎం.కృష్ణమూర్తి, ఎస్.బాబావలి, రామసుబ్బయ్య, మసూద్, కెఎం.గౌస్, నూరుద్దీన్, మహమ్మద్, పి.వినోద్, తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న అసోసియేషన్ నాయకులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారుల డుమ్మా

ప్రజాశక్తి-సోమందేపల్లి

ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజాసమస్యల పరిష్కారవేదిక' కార్యక్రమానికి అధిక శాతం అధికారులు గైర్హాజరవుతున్నారు. ఇందులో మండల స్థాయి, ఇతర అధికారులు సుమారు 15 నుంచి 20 మంది పాల్గొనాల్సి ఉండగా నలుగురైదురు మాత్రమే హాజరవు తున్నారు. కొందరు అధికారులు వారికి ఇష్టమొచ్చి నప్పుడు అలా వచ్చి సంతకం చేసి ఇలా వెళ్లిపోతున్నారు. ఈ క్రమంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్కు తహశీల్దార్, ఎంఇఓ, వెలుగు అధికారి, ఎంపిడిఓ, ఉపాధి హామీ, హౌసింగ్ అధికారులు మాత్రమే హాజరు కాగా, మిగతా ఏ శాఖ అధికారులు కనపడలేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలు వినేందుకు అధికారులు అందుబాటులో లేనప్పుడు అర్జీలు ఇచ్చి ఏమి ఫలితం అని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి గైర్హజరయ్యే అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'ఉపాధి'లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటుందని ఎంపిడివో పోలప్ప తెలిపారు. కదిరి రూరల్ మండలంలోని కదిరి బ్రాహ్మణపల్లి, బత్తలపల్లి గ్రామ పొలాల్లో మహిళా రైతు లక్ష్మీదేవి సాగు చేసిన మామిడి తోటను సోమవారం ఎంపీడీవో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సొమ్ము రైతులకు సక్రమంగా అందకుండా ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అలాగే కదిరి బత్తలపల్లి ఏరియాలో ఉపాధి కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వారి సమస్యలు తెలుసుకుని మస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట ఉపాధి సిబ్బంది, కూలీలు ఉన్నారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కుక్కల బెడద నుంచి కాపాడండి

ప్రజాశక్తి-తలుపుల

కొండలు, గుట్టల్లో కుక్కల బెడద ఎక్కువైందని వాటిని నియంత్రించాలని కోరుతూ సోమవారం పూలబజార్, గుడిబాయి బజార్ వాసులు సోమవారం ఎంపిడిఓ రమానాయక్కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ తాము మేకలు, గొర్రెలను పెంచుతూ వాటి ద్వారా జీవనోపాధి పొందుతున్నా మన్నారు. జీవాలను మేత కోసం కొండలు, గుట్టల్లోకి తీసుకెళ్లే సమయంలో వాటిపై కుక్కలు పెద్దఎత్తున దాడి చేసి గొర్రెలు, మేకలను చంపితింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కుక్కలను బంధించి వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.